క్లుప్తంగా

'వశిష్ఠ'లో ఫ్రెషర్స్ డే..



నృత్యం చేస్తున్న విద్యార్థినులు

నిర్మల్‌టౌన్: జిల్లా కేంద్రంలోని ఆర్కే కన్వెన్షన్ హాలులో మంగళవారం వశిష్ఠ డిగ్రీ కళాశాలలో ప్రథమ సంవత్సరం విద్యార్థులకు ఫ్రెషర్స్ డే నిర్వహించారు. ద్వితీయ, తృతీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థులు వారికి స్వాగతం పలికారు. విద్యార్థులు లక్ష్యాన్ని నిర్దేశించుకొని ముందుకు సాగాలని అధ్యాపకులు సూచించారు. ఈ సందర్భంగా పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

సామిల్ తనిఖీ

ఖానాపూర్: పట్టణంలోని ఇంద్రానగర్ కాలనీలో ఉన్న కలప సామిల్‌ను ఫ్లయింగ్ స్క్వాడ్ ఎఫ్ఆర్‌వో రమాదేవి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈసందర్భంగా డిపోలో నిల్వ ఉన్న కలపతోపాటు రికార్డులను పరిశీలించారు. అటవీ అధికారులు, సిబ్బంది ఉన్నారు.

జ్వరంతో మహిళ మృతి

ఖానాపూర్: పట్టణంలోని అంబేద్కర్‌నగర్ కాలనీకి చెందిన డి.శంకరమ్మ(40) అనే మహిళ సోమవారం రాత్రి అనారోగ్యంతో మృతి చెందింది. కొద్దిరోజుల కిందట జ్వరంతో స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందింది. రక్తకణాలు తగ్గడంతో పట్టణంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చేరగా పరిస్థితి విషమించింది. వెంటనే కుటుంబీకులు నిర్మల్‌కు తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. శంకరమ్మకు భర్త నర్సయ్య, కూతురు, కొడుకు ఉన్నారు.

వీడీసీ ఎన్నిక

పెంబి: మండలంలోని ఇటిక్యాల్ గ్రామ అభివృద్ధి కమిటీని మంగళవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గ్రామాభివృద్ధి కమిటీ చైర్మన్‌గా మద్దెల మహేందర్, వైస్ చైర్మన్‌గా సుంచు నర్సయ్య, ప్రధాన కార్యదర్శిగా మిర్జా సమ్మిబేగ్, సహాయ కార్యదర్శులుగా బానవత్ వినాయక్, సాబీర్‌ఖాన్, రాజేందర్, రాజు, కోశాధికారిగా పటేల్ గణేశ్, ప్రచార కార్యదర్శులుగా సురేందర్, దేవేందర్, సభ్యులుగా శంకర్, గణేశ్, పోశన్న, రాజు, శేఖర్, సోమేశ్, లక్ష్మణ్, శంకర్, బాపురావు, నానేష్, లింగేశ్, రాజేందర్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అనంతరం కమిటీని గ్రామస్తులు సన్మానించారు.

'ఎలక్ట్రీషియన్ల సమస్యలు పరిష్కరిస్తాం'

ఖానాపూర్: ప్రైవేట్ ఎలక్ట్రీషియన్లు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని మున్సిపల్ చైర్మన్ చిన్నం సత్యం అన్నారు. మంగళవారం పట్టణంలోని ఎలక్ట్రీషియన్ యూనియన్ ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో మాట్లాడారు. కార్యక్రమంలో యూనియన్ సభ్యులు, నాయకులు ఉన్నారు.

మైక్‌సెట్ అందజేత

కుంటాల: మండలంలోని కల్లూరు ప్రాథమిక పాఠశాలకు అదే గ్రామానికి చెందిన మిట్టపల్లి సాయినాథ్ దంపతులు మంగళవారం రూ.4,500 విలువైన డీజే బాక్సులు, ఎంప్లిఫైర్, మైక్‌సెట్‌ను విరాళంగా అందజేశారు. ఈ సందర్భంగా వారిని ఉపాధ్యాయులు సన్మానించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు చంద్రశేఖర్‌రావు, ఉపాధ్యాయులు నవీన్, పద్మలత, సుజాత పాల్గొన్నారు.

7 నుంచి గ్రామసభలు

కుంటాల: మండలంలోని 2025–26 ఆర్థిక సంవత్సరంలో చేపట్టే ఉపాధిహామీ పనుల గుర్తింపునకు ఈనెల 7 నుంచి నవంబర్ 4 వరకు గ్రామసభలు నిర్వహించనున్నట్లు ఏపీవో గట్టుపల్లి నవీన్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. మూడు దఫాలుగా నిర్వహించే గ్రామ సభలో గ్రామస్తులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

పారిశుధ్యంపై దృష్టి సారించాలి



దిలావర్‌పూర్‌లో పర్యవేక్షిస్తున్న అధికారులు

ఖానాపూర్: గ్రామాల్లో పారిశుధ్యం లోపించకుండా పంచాయతీ అధికారులు, సిబ్బంది ప్రత్యేక దృష్టి సారించాలని ఎంపీవో రత్నాకర్ రావు అన్నారు. మంగళవారం మండలంలోని దిలావర్‌పూర్, కొత్తపేట్, బావాపూర్(కె) గ్రామాల్లో స్వచ్ఛతా హీ సేవాలో భాగంగా పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.

మామడలో..

మామడ: స్వచ్ఛతా హీ సేవాలో భాగంగా మంగళవారం మామడలో స్వయం సహాయక సంఘాల సభ్యులు శ్రమదానం నిర్వహించారు. పరిశుభ్రత పాటించి వ్యాధులు బారిన పడకుండా చూసుకోవాలని డీఆర్డీవో విజయలక్ష్మి అన్నారు. ఎంపీడీఓ గంగాసాగర్‌రెడ్డి, ఐకేపీ ఏపీఎం అరుణ పాల్గొన్నారు.

పాఠశాలల్లో పూలపండుగ



మామడ: తాండ్ర ప్రాథమిక పాఠశాలలో..



ఖానాపూర్‌లోని ఓ పాఠశాలలో..

సోన్/మామడ/కుభీర్/నర్సాపూర్(జి)/నిర్మల్‌టౌన్/కుంటాల/ముధోల్/తానూరు/లక్ష్మణచాంద/భైంసారూరల్/లోకేశ్వరం/భైంసాటౌన్/ఖానాపూర్ : జిల్లావ్యాప్తంగా పలు ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, నిర్మల్, భైంసాలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో మంగళవారం ముందస్తు బతుకమ్మ సంబురాలు ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు తీరొక్క పూలతో బతుకమ్మలను పేర్చి ఆడిపాడారు. నిర్మల్‌లోని ఆదర్శనగర్ అల్ఫోర్స్ పాఠశాలలో నిర్వహించిన బతుకమ్మ వేడుకల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు.



బాసరలోని బాలికల ఉన్నత పాఠశాలలో బతుకమ్మల వద్ద విద్యార్థులు



సోన్: సిద్ధులకుంట జెడ్పీ ఉన్నత పాఠశాలలో వేడుకల్లో పాల్గొన్న విద్యార్థులు, ఉపాధ్యాయులు



తానూరు: ఎల్వి జెడ్పీ ఉన్నత పాఠశాలలో పూజలు చేస్తున్న ఎంఈవో నరేందర్



భైంసారూరల్: దేగాం ప్రాథమిక పాఠశాలలో బతుకమ్మలతో విద్యార్థులు



లక్ష్మణచాంద : పొట్టపెల్లిలో బతుకమ్మలతో విద్యార్థులు, ఉపాధ్యాయులు



నిర్మల్‌లోని ఆదర్శనగర్ అల్ఫోర్స్‌లో..



కుంటాల ఆదర్శ పాఠశాలలో..



ముధోల్‌లోని బాలికల ఉన్నత పాఠశాలలో..



నర్సాపూర్(జి) ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో..



లోకేశ్వరం: బిలోలిలో బతుకమ్మలతో అంగన్‌వాడీలు



భైంసాలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో..



నిర్మల్‌లోని ఓ పాఠశాలలో..



దిలావర్‌పూర్ కేజీబీవీలో..

దసరా సెలవులొచ్చేశాయ్

రాష్ట్రప్రభుత్వం పాఠశాలలు, జూనియర్ కళాశాలలకు ఈనెల 2వ తేదీ నుంచి 14 వరకు దసరా సెలవులు ప్రకటించింది. ఈనేపథ్యంలో మంగళవారం విద్యార్థులు ఇంటిబాట పట్టారు. మధ్యాహ్నం తల్లిదండ్రులు హాస్టళ్ల వద్దకు వచ్చి విద్యార్థుల సామగ్రి, బ్యాగులు మోసుకెళ్తూ కనిపించారు. దీంతో బస్టాండ్ ప్రాంగణంలో రద్దీ నెలకొంది. సీట్ల కోసం బస్సుల వెంట పరుగెడుతూ ఫీట్లు చేశారు.

– సాక్షి, ఫొటోగ్రాఫర్, నిర్మల్







నిర్మల్ బస్టాండ్‌లో తిప్పలు పడుతున్న విద్యార్థులు, వారి తల్లిదండ్రులు



సోఫీనగర్ గురుకులం నుంచి పిల్లలను ఇంటికి తీసుకెళ్తున్న తల్లిదండ్రులు

పీఆర్టీయూ జిల్లా కార్యవర్గంలో చోటు

నిర్మల్‌రూరల్: పీఆర్టీయూ తెలంగాణ జిల్లా కార్యవర్గంలో పలువురికి చోటు కల్పించినట్లు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వై.సాయన్న హరిప్రసాద్ తెలిపారు. జిల్లా కార్యదర్శులుగా ముధోల్ మండలం బోర్గాం ఉన్నత పాఠశాల ఉపాధ్యాయుడు నాకిడి గంగయ్య, లక్ష్మణచాంద ఉన్నత పాఠశాల ఉపాధ్యాయుడు శ్రీనివాస్‌రెడ్డి, నిర్మల్ మండలంలోని వెంగ్వపేట్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయుడు ప్రశాంత్‌ను నియమించినట్లు పేర్కొన్నారు.

దుబాయ్‌లో బతుకమ్మ సంబురాల పోస్టర్ ఆవిష్కరణ

ఖానాపూర్: దుబాయ్‌లో ఈనెల 5వ తేదీన గల్ఫ్ తెలంగాణ ఫోరం ఆధ్వర్యంలో నిర్వహించే బతుకమ్మ సంబురాలకు సంబంధించిన పోస్టర్‌ను సోమవారం రాత్రి దుబాయ్‌లో ఆవిష్కరించారు. దుబాయ్‌లోని అల్ కుసైస్ ప్రాంతంలోని అమిటీ స్కూల్‌లో ఈనెల 5న వేడుకలు నిర్వహించనున్నట్లు గల్ఫ్ తెలంగాణ ఫోరం సభ్యులు సురేందర్, రాజేశ్వర్, జగన్, వెంకటేశ్, బాలరాజు, పవన్‌సాయి తెలిపారు. ఉత్సవాలకు దుబాయ్‌లోని గల్ఫ్ కార్మికులు హాజరుకావాలని కోరారు.

నిల్వనీటిని పారబోయాలి

ముధోల్: దోమలు వ్యాప్తి చెందకుండా పరిసరాల్లో నిల్వనీటిని పారబోయాలని డీపీవో శ్రీనివాస్ అన్నారు. మంగళవారం మండలంలోని తరోడా గ్రామంలో స్వచ్ఛదనం–పచ్చదనం కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. వారి వెంట సీసీ పోశెట్టి, పంచాయతీ కార్యదర్శి భాస్కర్‌గౌడ్, అంగన్‌వాడీ టీచర్లు తబస్సుమ్, రేష్మ, ఆశాకార్యకర్త అఫ్సరీ బేగం, వీవో అధ్యక్షులు రాధ, వీవోఏ ఓమేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.



నిల్వనీటిని పారబోయిస్తున్న డీపీవో శ్రీనివాస్

పంచాయతీ సిబ్బందికి శిక్షణ

భైంసారూరల్: ఎంపీడీవో కార్యాలయంలో మంగళవారం మండలంలోని అన్ని పంచాయతీల సిబ్బందికి డీపీవో శ్రీనివాస్ శిక్షణ తరగతులు నిర్వహించారు. చేతిపంపుల మరమ్మతులు, బోర్లు మొరాయిస్తే ఎలా రిపేర్ చేయాలో వివరించారు. అత్యవసర వేళ ఎవరూ లేకున్నా.. సేవలకు ఆటంకం కలుగకుండా చూడాలని సూచించారు. కార్యక్రమంలో డీఎల్‌పీవో సుదర్శన్, ఎంపీడీవో సుధాకర్‌రెడ్డి, ఎంపీవో మోజం హుస్సేన్, సిబ్బంది ఉన్నారు.

పాఠశాలలో ఫుడ్ ఫెస్టివల్

కుంటాల: మండలంలోని కల్లూరు ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో మంగళవారం ఫుడ్ ఫెస్టివల్ నిర్వహించారు. విద్యార్థులు ఇంటి నుంచి తీసుకొచ్చిన వంటకాలను ప్రదర్శించారు. పౌష్టికాహారం, జంక్ ఫుడ్ మధ్య భేదాలపై అవగాహన కల్పించేందుకు ఫుడ్ ఫెస్టివల్ నిర్వహించినట్లు ప్రధానోపాధ్యాయులు చంద్రశేఖర్‌రావు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు నవీన్, పద్మలత, సుజాత, విద్యార్థులు పాల్గొన్నారు.



వంటకాలను ప్రదర్శిస్తున్న విద్యార్థులు

విద్యార్థులు క్రీడల్లో రాణించాలి

కుంటాల: విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించాలని ఎస్సై సీహెచ్.భాస్కరాచారి పేర్కొన్నారు. కుంటాలలోని విజయసాయి పాఠశాల విద్యార్థులు ఇటీవల కరాటే పోటీల్లో ప్రతిభ కనబరిచి పతకాలు సాధించారు. మంగళవారం వారిని పాఠశాలలో సన్మానించారు. కార్యక్రమంలో ఏఎస్సై దేవరావు, ప్రిన్సిపాల్ వంగెర స్వప్న, కరాటే ఇన్‌స్ట్రక్టర్ గజేందర్, పి.సంతోష్, మురళి, రాథోడ్ అరవింద్ తదితరులు పాల్గొన్నారు.

శుభ్రమైన నీటిని అందించాలి

మామడ: మిషన్ భగీరథ సహాయకులు నీటిని ఎప్పటికప్పుడు పరీక్షిస్తూ.. ప్రజలకు శుభ్రమైన తాగునీటిని అందించాలని డీఆర్డీవో విజయలక్ష్మి అన్నారు. మంగళవారం మండలకేంద్రంలో మిషన్ భగీరథ ఆధ్వర్యంలో మామడ, లక్ష్మణచాంద మండలాల్లోని పంచాయతీల్లోని మంచినీటి సహాయకులకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో మాట్లాడారు. మామడ, లక్ష్మణచాంద ఎంపీడీఓలు గంగాసాగర్‌రెడ్డి, రాథోడ్ రాధ, ఏఈ క్రాంతికుమార్, ఎంపీఓ అమీర్‌ఖాన్, ఏపీవో శివాజీ, ఏపీఎం అరుణ, మామడ కార్యదర్శి మహేందర్ ఉన్నారు.



మాట్లాడుతున్న డీఆర్డీవో విజయలక్ష్మి

కుభీర్: మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో మంగళవారం ఆర్‌డబ్ల్యూస్ అధికారులు భగీరథ నీటిని సరఫరా చేసే సహాయకులకు పలు అంశాలపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. మండలంలోని 42గ్రామ పంచాయతీల సిబ్బందికి మరో మూడు రోజులు శిక్షణ నిర్వహించనున్నట్లు అధికారి భూమన్న తెలి పారు. ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ లక్ష్మీనారాయణ, ఏఈ రాజన్న, ఎంపీడీవో నవనీత్‌కుమార్, ఎంపీవో మోహన్‌సింగ్, అధికా రులు గ్రామ పంచాయతీల సిబ్బంది పాల్గొన్నారు.

జీతాలు ఇవ్వాలని ఆందోళన

నిర్మల్‌టౌన్: తమకు నాలుగు నెలలుగా జీతాలు ఇవ్వడం లేదని పట్టణంలోని కాంట్రాక్ట్ పారిశుధ్య కార్మికులు ఆందోళన బాట పట్టారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని మున్సిపల్ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. జీతాలు ఇవ్వకుంటే పూట గడవడం కష్టంగా ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. సూర్యుడు రాక ముందే రోడ్లు, డ్రెయినేజీలు శుభ్రం చేసే మాకు అధికారులు సకాలంలో జీతాలు చెల్లించాలని వేడుకున్నారు.



నిరసన వ్యక్తం చేస్తున్న పారిశుధ్య కార్మికులు

ఈరోజు

భూసార్ బీట్ బంద్

భైంసాటౌన్: పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ కమిటీ యార్డులో బుధవారం భూసార్ బీట్ బంద్ ఉంటుందని కార్యదర్శి శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. గాంధీజయంతి, అమావాస్య సందర్భంగా కొనుగోళ్లు నిలిపివేసినట్లు పేర్కొన్నారు. రైతులు, వ్యాపారులు, కమిషన్ ఏజెంట్లు గమనించి సహకరించాలని కోరారు.

గ్రామసభలు

తానూరు: మండలంలోని పలు గ్రామాల్లో బుధవారం 2025–26 ఆర్థిక సంవత్సరంలో చేపట్టే ఉపాధి పనుల గుర్తింపునకు గ్రామసభలు నిర్వహించనున్నట్లు ఈజీఎస్ ఏపీవో గంగాధర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈజీఎస్ సిబ్బంది, గ్రామాధికారులు హాజరై పనుల ప్రణాళికలను తయారు చేయనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమానికి ఆయా గ్రామాల ఉపాధి కూలీలు హాజరు కావాలని కోరారు.

నియామకం

బాసర: ఉమ్మడి ఆదిలాబాద్, నిజామాబాద్, కరీంనగర్, మెదక్ జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల సంబంధించి బీజేపీ ముధోల్ అసెంబ్లీ ఇన్‌చార్జిగా లోకేశ్వరం మండలం కిష్టపూర్ గ్రామానికి చెందిన సుమన్‌ను, సహ ఇన్‌చార్జిగా కుంటాలకు చెందిన జక్కుల గజేందర్‌ను, బాసర మండల ఇన్‌చార్జిగా పుట్నాల సాయినాథ్ పటేల్ నియమితులయ్యారు. ఈమేరకు ఆ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి, ఎమ్మెల్సీ ఎన్నికల ఇన్‌చార్జి పడిపెల్లి గంగాధర్ ఓ ప్రకటన విడుదల చేశారు. వారు మాట్లాడుతూ తమపై నమ్మకం ఉంచి బాధ్యత అప్పగించినందుకు జిల్లా ఇన్‌చార్జి పడిపెల్లి గంగాధర్, ముధోల్ ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్, జిల్లా అధ్యక్షుడు అంజుకుమార్‌రెడ్డికి ధన్యవాదాలు తెలిపారు.

ప్రకృతి వ్యవసాయంపై అవగాహన

లోకేశ్వరం: ప్రకృతి వ్యవసాయానికి తల్లిదండ్రులు మొగ్గు చూపేలా విద్యార్థులు అవగాహన కల్పించాలని విశ్రాంత పశువైద్యాధికారి నారాయణ్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు ప్రకృతి వ్యవసాయం, గోమూత్రంతో ఆరోగ్య సంరక్షణపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ప్రిన్సిపాల్ గౌతం, విశ్రాంత బ్యాంకు మేనేజర్, రామకృష్ణారెడ్డి, రాజారెడ్డి, పాల గంగాధర్, అధ్యాపకులు పాల్గొన్నారు.

కుంటాలలో భారీ వర్షం

కుంటాల: మండలంలోని ఓలా, అందాకూర్, కల్లూరు, అంబకంటి, లింబా(కె), లింబా(బి), విఠాపూర్ తదితర గ్రామాల్లో మంగళవారం మధ్యాహ్నం భారీ వర్షం కురిసింది. వర్షంతో కోతకు వచ్చిన సోయా పంటకు నష్టం వాటిల్లుతుందని రైతులు పేర్కొన్నారు. నూర్పిడి చేసిన సోయా తడవకుండా రైతులు టార్పాలిన్లను కప్పి ఉంచారు.

రైతుదీక్షలో మండల నాయకులు

లక్ష్మణచాంద: హైదరాబాద్‌లోని ఇందిరానగర్‌లో చేపట్టిన రైతు దీక్షలో మండల బీజేపీ నాయకులు పాల్గొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు ఇచ్చిన హామీలు అమలు చేయాలని కోరుతూ నిర్మల్ ఎమ్మెల్యే బీజేఎల్పీ నేత మహేశ్వర్ రెడ్డికి మద్దతుగా దీక్షలో కూర్చొన్నారు. భూపాల్‌రెడ్డి, అడ్వాల రమేశ్, సురేశ్, రాజారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మోదీ పాలనలోనే అభివృద్ధి

ఖానాపూర్: ప్రధాని నరేంద్రమోదీ పాలనలోనే దేశం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతుందని బీజేపీ పట్టణ అధ్యక్షుడు నాయిని సంతోష్ అన్నారు. మంగళవారం పట్టణంలోని 242వ బూత్‌లో సభ్యత్వ నమోదు కార్యక్రమం చేపట్టారు. అంతకుముందు 233వ బూత్‌లో బీజేపీ నాయకులు అనిల్ ఆధ్వర్యంలో సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. కొండవేని రమేశ్, నాగరాజు, మురళి, సుధాకర్, చంద్రశేఖర్, రంజిత్ ఉన్నారు.

కలెక్టర్‌ను కలిసిన మహిళా కమిషన్ సభ్యురాలు

నిర్మల్‌చైన్‌గేట్: కలెక్టరేట్‌లో కలెక్టర్ అభిలాష అభినవ్‌ను మంగళవారం మహిళా కమిషన్ సభ్యురాలు ఈశ్వరీబాయి మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పుష్పగుచ్ఛం అందించారు.



కలెక్టర్‌తో ఈశ్వరీబాయి

చదువుతోనే ఉజ్వల భవిష్యత్తు

కుంటాల: కష్టపడి చదివితేనే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని ప్రిన్సిపాల్ సంతోష్, డైరెక్టర్ ప్రవీణ్ పేర్కొన్నారు. మండలంలోని అంబకంటి తండాకు చెందిన జాదవ్ దివ్య శాంతినికేతన్ పాఠశాలలో చదివి జగిత్యాలలోని వైద్య కళాశాలలో ఎంబీబీఎస్ సీటు సాధించింది. మంగళవారం దివ్యను సన్మానించి మాట్లాడారు. కార్యక్రమంలో హోంగార్డ్ శ్యాం నాయక్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.